సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 31 । మే । 2024



అప్పన్నకు ఆర్జిత సేవలు 8లో

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు.



సిరులతల్లికి పంచామృతాభిషేకం

బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. 8లో



15 నుంచి మందు స్ప్రేయింగ్

వచ్చే నెల 15 నుంచి మలేరియా నివారణ మందు స్ప్రేయింగ్ ప్రారంభం కానుందని ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



రంపచోడవరంలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత, ఆర్వో ప్రశాంత్‌కుమార్, పీవో సూరజ్‌గనోరే, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లు దాదాపు పూర్తి కావచ్చినట్టు కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను రంపచోడవరం అసెంబ్లీ ఆర్వో ఎస్.ప్రశాంత్‌కుమార్, పీవో సూరజ్‌గనోరే, ఏఎస్పీ జగదీష్ అడహళ్లిలతో కలిసి ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కౌంటింగ్‌కు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కృష్ణజ్యోతి, సీఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ మోహనకుమార్ ఉన్నారు.

మారథాన్‌లో సచివాలయ ఉద్యోగి సత్తా



కొర్రా గోపి

అనంతగిరి: మండలంలోని రొంపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొర్రా గోపి మారథాన్ పోటీల్లో సత్తాచాటాడు. ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగిన పోటీల్లో 5 కె రన్‌లో ప్రథమ స్థానంలోని నిలిచి, బంగారు పతకం సాధించాడు. గోపీ మారథాన్ పోటీల్లో రాణిస్తుండడంతో తోటి ఉద్యోగులు, మండలస్థాయి అధికారులు అభినందించారు.

చింతూరు @ 43 డిగ్రీలు



నిర్మానుష్యంగా మారిన చింతూరు, భద్రాచలం ప్రధాన రహదారి

చింతూరు: ఇటీవల కురిసిన వర్షాలతో సేదతీరిన మన్యంవాసులు తుపాను అనంతరం ఒక్కసారిగా ఎండలు పెరగడంతో తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. రోహిణీకార్తె ప్రభావంతో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. గురువారం చింతూరులో అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండవేడిమిని భరించలేక ఎవరూ బయటకు రాకపోవడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున బయట తిరగవద్దని, అత్యవసర పరిస్థితుల్లో తిరగాల్సివస్తే తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

బీసీజీ టీకాతో క్షయ నిర్మూలన

- జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి సాధన



పినకోట పీహెచ్‌సీలోని బీసీజీ టీకాను భద్రపరిచిన గదిని పరిశీలిస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి సాధన

అనంతగిరి: క్షయవ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బీసీజీ టీకా వేయించుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి సీహెచ్ సాధన తెలిపారు. మండలంలోని మారుమూల పినకోట పంచాయతీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ముందు బీసీజీ టీకా ఏ విధంగా వేస్తున్నారనే దానిపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టీకాను భద్రపరిచే గదిని పరిశీలించి, అనంతరం బర్త్ వెయింటింగ్ హాల్‌లోని గర్భిణులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ నుంచి జీనబాడులో బీసీజీ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలోని వైద్యాధికారి డి.రూప్‌చంద్, హెల్త్ ఎడ్యుకేటర్ రవిశర్మ, పర్యవేక్షకురాలు సావిత్రి, యూడీసీ బాషా, సిబ్బంది అశ్విని, శ్రీదేవి, విజయ, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

బడి తెరిచిన రోజే పుస్తకాలు



మండల స్టాక్ పాయింట్లకు చేరుకున్న పుస్తకాలు

- పంపిణీకి విద్యాశాఖ ముందస్తు చర్యలు
- మండలాల స్టాక్ పాయింట్లలో సిద్ధం

సాక్షి, పాడేరు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినీవిద్యార్థులందరికీ వేసవి సెలవుల అనంతరం బడుల పునఃప్రారంభ రోజునే పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేసేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 22 మండలాల పరిధిలో అన్ని యాజమాన్యాలకు చెందిన 2,917 పాఠశాలల్లో విద్యార్థులందరికీ జూన్ 12వ తేదీన పుస్తకాలు పంపిణీ చేసే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ ఇండెంట్ పెట్టింది. దీంతో జిల్లాకు మొదటి దశలో 6,53,252 నోట్, 1,91,161 పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. వాటిని అన్ని మండల కేంద్రాల్లోని పాయింట్‌లకు సరఫరా చేశారు. ఉపాధ్యాయుల ద్వారా పాఠశాలలకు చేర్చేందుకు ఎంఈవోలు, ఇతర విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐదవ ఏటా అందుబాటులో...

పేద విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. గత నాలుగేళ్లుగా విద్యాకానుక కిట్ పేరుతో ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులంతా పాఠశాలల ప్రారంభం రోజునే పుస్తకాలను అందుకున్నారు. ఐదవ ఏడాది కూడా విద్యార్థులకు విద్యాశాఖ పుస్తకాలు అందుబాటులోకి తేవడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1వ తరగతి నుంచి 10వతరగతి వరకు అవసరమయ్యే అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు పూర్తిస్థాయిలో స్టాక్ పాయింట్లకు చేరాయి.

మొదటి దశలో జిల్లాకు చేరిన పుస్తకాలు		
నోట్ బుక్స్	:	6,53,252
టెక్ట్స్ బుక్స్	:	1,91,161

విద్యార్థులందరికీ పుస్తకాలు



జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ నోట్, పాఠ్యపుస్తకాలను పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. పాత స్టాక్‌తో కలుపుకుని పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇండెంట్ ప్రకారం రెండవ దశలో మరిన్ని పుస్తకాలు మండల స్టాక్ పాయింట్లకు చేరుకుంటాయి. నోట్ పుస్తకాలు మాత్రం ఇప్పటికే పుష్కలంగా చేరాయి. పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం.

– పి.బ్రహ్మాజీరావు, డీఈవో

మండలాల వారీగా పుస్తకాల వివరాలు

మండలం	నోట్ బుక్స్	టెక్ట్స్ బుక్స్
అడ్డతీగల	25,898	10,555
అనంతగిరి	48,282	13,149
అరకులోయ	51,332	13,111
చింతపల్లి	53,632	13,230
చింతూరు	35,392	11,511
దేవీపట్నం	11,018	7,837
డుంబ్రిగుడ	44,444	14,416
జీకే వీధి	11,340	12,591
జి.మాడుగుల	48,596	11,862
గంగవరం	15,858	--
కొయ్యూరు	42,936	11,179
కూనవరం	17,068	--
మారేడుమిల్లి	25,186	--
మంచంగిపుట్టు	36,108	11,250
ఎటపాక	18,666	--
పాడేరు	26,702	14,418
పెదబయలు	--	11,952
రాజవొమ్మంగి	28,828	12,095
రంపచోడవరం	44,912	--
వై.రామవరం	21,436	--

అప్రమత్తంగా కౌంటింగ్ విధులు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత

కలెక్టర్ విజయ సునీత

రంపచోడవరం: కౌంటింగ్ విధులను సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశించారు. కౌంటింగ్ నిర్వహణపై ఐటీడీఏ సమావేశం హాలులో తహసీల్దార్లు, డీటీలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రశాంతమైన వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో ఎస్.ప్రశాంత్‌కుమార్‌ను రంపచోడవరం అసెంబ్లీ స్థానం ఓట్ల కౌంటింగ్‌కు, పీవో సూరజ్‌గనోరే అరకు పార్లమెంట్ ఓట్లు లెక్కింపు పర్యవేక్షణకు నియమించినట్టు చెప్పారు. జిల్లాలోని రంపచోడవరం, పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాలకు, పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కౌంటింగ్‌కు అసెంబ్లీ స్థానాలకు 20 టేబుళ్లు, పార్లమెంట్ స్థానానికి 20 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో పరిశీలించిన తరువాత మాత్రమే ఫలితాలు ప్రకటించాలని తెలిపారు. కౌంటింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది, అధికారులు ఉదయం 5గంటల లోపే కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. గుర్తింపు కార్డు లేని వారికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదన్నారు. ఎన్నికల పరిశీలకులు, మైక్రో పరిశీలకులు పర్యవేక్షణలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. సమీక్షలో ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌లో స్వల్ప మార్పులు



డాక్టర్ సుజాత

సాక్షి, పాడేరు: పాలిసెట్ కౌన్సెలింగ్‌లో స్వల్ప మార్పులు చేశారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసినట్టు స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత గురువారం తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన ఫీజులు చెల్లింపు, ధ్రువీకరణపత్రాల పరిశీలన, ఆన్‌లైన్ ప్రక్రియలో ఎలాంటి మార్పులు లేవని, జూన్ 2వతేదీ వరకు ఈ ప్రకియ జరుగుతుందన్నారు. ఈ నెల 4న ఎన్నిక ఫలితాలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహిస్తున్న కారణంగా.. 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. దీంతో 3వ తేదీ నుంచి కౌన్సెలింగ్‌కు వచ్చేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల 3వతేదీన జరగాల్సిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన 6వతేదీన నిర్వహిస్తామని, ప్రత్యేక కేటగిరి అభ్యర్థులకు ఇదే వర్తిస్తుందన్నారు. జూన్ 7వతేదీ నుంచి 10వతేదీ వరకు వెబ్ ఆప్షన్‌ల నమోదుకు అవకాశం ఉందన్నారు. జూన్ 11వతేదీన ఆప్షన్‌లు మార్పు చేసుకోవచ్చన్నారు. జూన్ 13వతేదీన సీట్ల కేటాయింపు ప్రక్రియ జరుగుతుందని, జూన్ 14వ తేదీ నుంచి 19వతేదీ లోగా సీట్లు ఖారారు అయిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో చేరాలని తెలిపారు. విద్యార్థులు వ్యక్తిగతంగాను లేక ఆన్‌లైన్ విధానంలోనూ రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. జూన్ 14వతేదీనుంచి తరగతులను ప్రారంభిస్తామని, పాలిసెట్ 2024కు అర్హత సాధించిన అభ్యర్థులంతా షెడ్యూల్‌లో చోటుచేసుకున్న మార్పులను గ్రహించాలని ప్రిన్సిపాల్ సుజాత కోరారు.

ఆప్షన్ల నమోదు	:	జూన్ 7నుంచి 10
ఆప్షన్ల మార్పిడి	:	జూన్ 11
సీట్ల కేటాయింపు	:	జూన్ 13
సెల్ఫ్ జాయినింగ్ రిపోర్ట్	:	జూన్ 14 నుంచి 19
తరగతులు ప్రారంభం	:	జూన్ 14

అరకు ఐపీవో ఉపేంద్రకు రాష్ట్రస్థాయి అవార్డులు



పోస్టమాస్టర్ జనరల్ ప్రకాష్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అరకు ఐపీవో ఉపేంద్ర

ముంచంగిపుట్టు: అరకు పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ బి.ఉపేంద్ర ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్‌లో మూడు కేటగిరీల్లో ఉత్తమ అధికారిగా అవార్డులు అందుకున్నారు. ఏపీలో ఉన్న 127 సబ్ డివిజన్లలో అరకు సబ్ డివిజన్‌లో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు(ఐపీపీబీ) సేవలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు అధికంగా ఐపీపీబీ ఖాతాలను ప్రజలు వినియోగించుకునేలా చేసిన కృషిని గుర్తించిన పోస్టల్‌శాఖ ఉన్నతాధికారులు రాష్ట్రంలోనే ఉత్తమ ఐపీవోగా ఆయనను ఎంపిక చేశారు. గురువారం విశాఖలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీసర్కిల్ చీఫ్ పోస్టమాస్టర్ జనరల్ ఎ.ప్రకాష్ చేతుల మీదగా ఉపేంద్ర అవార్డులు అందుకున్నారు. అరకు సబ్ డివిజన్ పరిధిలోని మాధల బ్రాంచ్ పోస్టమాస్టర్ శెట్టి హరినాథ్ ఐపీపీబీ సేవలు అందించడంలో రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచి ఉత్తమ బీపీఎంగా అవార్డును అందుకున్నారని ఐపీవో ఉపేంద్ర తెలిపారు. అరకు ఐపీవోకు రాష్ట్రస్థాయి అవార్డు రావడంతో అరకు సబ్ డివిజన్ పోస్టల్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

1 నుంచి గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో తరగతులు

పాడేరు: స్థానిక ఐటీడీఏ పరిధిలో గల ఎనిమిది గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో జూన్ 1 నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సర తరగతులు ప్రారంభిస్తున్నట్టు గురుకుల కళాశాలల కన్వీనర్ యండమూరి పారయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అరకులోయ, పాడేరు, జీకే వీధి గురుకుల బాలికల కళాశాలల్లో 450 సీట్లు, అరకువ్యాలీ, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు గురుకుల బాలుర కళాశాలల్లో 800 సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసినట్టు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో జాయిన్ అయిన విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఎంపికైన కళాశాలలో జూన్ 1వ తేదీన హాజరుకావాలన్నారు.

ఖరీఫ్‌కు వరి విత్తనాలు సిద్ధం



పెదబయలులో రైతులకు సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రభాకర్, ఏవో, వ్యవసాయ సిబ్బంది

పాడేరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ప్రభాకర్

పెదబయలు: ఖరీఫ్‌లో వేసేందుకు వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నట్టు పాడేరు డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ప్రభాకర్ తెలిపారు. మండలంలోని అడుగులపుట్టు రైతు భరోసా కేంద్రంలోని వరి విత్తనాలను గురువారం ఆయన పరిశీలించారు. మొలకశాతం పరిశీలనకు అరకులోయలోని ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ లేబొరేటరీకి విత్తనాలను పంపాలని మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండలంలోని 16 గ్రామ సచివాలయాల వ్యవసాయ, ఉద్యాన వన సహాయకులతో సమావేశం నిర్వహించారు. విత్తనాలు, జీవ నియంత్రకాలతో విత్తన శుద్ధి, పచ్చి రొట్ట ఎరువుల వినియోగం, పొలంబడి నిర్వహణ, పీఎం కిసాన్ ఈకేవైసీ తదితర అంశాలపై సచివాలయాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు అన్ని ఆర్బీకేల్లో సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మంచి దిగుబడులు పొందేందుకు రైతులకు సలహాలు, సూచనలు అందించాలన్నారు. అనంతరం 90 శాతం సబ్సిడీతో పచ్చి రొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి అడ్డూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవజాత శిశువుకు అరుదైన చికిత్స

- ఆరు నెలల ముందే పుట్టిన బిడ్డ
- అవయవాలు పూర్తిగా సంతరించుకోని వైనం
- కూనవరం సీహెచ్‌సీ వైద్యుల కృషితో సంపూర్ణ ఆరోగ్యంగా శిశువు



తక్కువ బరువుతో పుట్టిన మగబిడ్డ



బిడ్డను సంపూర్ణ ఆరోగ్యంతో తల్లికి అప్పగించిన వైద్యబృందం

కూనవరం: నవ జాత శిశువుకు స్థానిక సీహెచ్‌సీ వైద్యులు అరుదైన చికిత్స అందించి సంపూర్ణ ఆరోగ్యంతో తల్లికి అప్పగించారు. పెద్ద నగరాల్లోని పెద్ద ఆస్పత్రులు, కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల్లో తప్ప విలీన మండలాల్లో ఇంతవరకు ఈ తరహా చికిత్స జరగలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. వీఆర్‌పురం మండలం బూరుగువాడ గ్రామానికి చెందిన కనుముల రాములమ్మ ఆరు నెలల గర్భిణి. నొప్పులు రావడంతో ఏప్రిల్ నెల 9న కూనవరం మండలం కోతులగుట్ట ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఆమెకు ప్రసవం చేసిన వైద్యులు షాక్ అయ్యారు. పుట్టిన మగబిడ్డ కేవలం 1000 గ్రాముల బరువు ఉన్నాడు. అవయవాలు సైతం పూర్తిగా సంతరించుకున్న దాఖలాలు లేకపోవడంతో ఏంచేయాలో తోచక స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌తో పాటు ఎస్ఎన్‌సీయూ వైద్యుడు, సిబ్బంది అయోమయంలో పడ్డారు. శిశువు తల్లి రాములమ్మను పిలిచి బాబు బతకాలంటే భద్రాచలం లేదా ఖమ్మం తీసుకువెళ్లాలని సూచించారు. అయితే పట్టణాల్లోని పెద్దాస్పత్రికి వెళ్లే ఆర్థిక స్తోమత లేదని, నా బిడ్డను మీరే బతికించాలని ఆ తల్లి ప్రాధేయపడింది. ఈవిషయాన్ని ఎస్ఎన్‌సీయూ వైద్యులు, సిబ్బంది సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌కు తెలిపారు. శిశువును సీహెచ్‌సీ పరిధిలో ఎస్ఎన్‌సీయూ ఉంచి వైద్యం అందిద్దామని ఆయన భరోసా ఇచ్చారు. దీంతో ఆ శిశువును ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కార్తీక్, డాక్టర్ సుభాష్‌లు ప్రతి రోజు అందిస్తున్న సలహాలు, సూచనల పాటిస్తూ 50 రోజుల పాటు ఎస్ఎన్‌సీయూ సిబ్బంది వైద్యసేవలు అందించారు. ఆ శిశువు పూర్తిస్థాయి అవయవాలతో రెండు కేజీల బరువు పెరగడంతో బుధవారం తల్లికి అప్పగించారు. దీంతో వైద్య బృందానికి, ఎస్ఎన్‌సీయూ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపింది. ఏజెన్సీ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్వోలదే తుది నిర్ణయం

- ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఈసీ మార్గదర్శకాలు
- ఏజెంట్ల సమక్షంలో తెరవనున్న స్ట్రాంగ్ రూంలు
- ఎన్‌కోర్ యాప్‌లో నమోదు తరువాతే ఫలితాల వెల్లడి

విశాఖసిటీ : సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగానే ఓట్ల లెక్కింపు ఫలితాలు ప్రకటించనున్నారు. కౌంటింగ్ అంశంపై ఈసీ పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఫలితాల ప్రకటనలో అధికారులు ఎవరూ సొంత నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేసింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయమే తుది నిర్ణయంగా భావించాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.

3 నాటికి ఏర్పాట్లు పూర్తి

జూన్ 4వ తేదీన 6 గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోగానే కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లు తెరవాల్సి ఉంటుంది. ఓట్ల లెక్కింపులో ఏవైనా సందేహాలు వచ్చినప్పుడు ఆర్‌వోలతో మాట్లాడి సందేహాలు నివృత్తి చేసుకోవాలి. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్లు, హోం ఓటింగ్, సర్వీస్ ఓటర్లు (ఈటీపీబీఎస్) ఓట్లు ఏవిధంగా లెక్కించాలి, వ్యాలీడ్, ఇన్‌వ్యాలీడ్ ఓట్లను ఏ విధంగా గుర్తించాలి అనే దానిపై జిల్లాలో రెండో విడత శిక్షణ ఇవ్వనున్నారు. కౌంటింగ్ ఏర్పాట్లన్నీ జూన్ 3వ తేదీకి పూర్తి చేసుకోవాలి. ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేయగా.. అక్కడే కేంద్ర పరిశీలకులతో పాటు కౌంటింగ్ సిబ్బంది ఉంటారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక కుర్చీలు ఏర్పాటు చేస్తారు. ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుళ్ల వద్దే ఉండాలి. పక్క టేబుల్ వద్దకు వెళ్లడానికి వీలులేదు. 18 టేబుళ్లకు 18 మంది ఏజెంట్లు ఉంటారు. ఒక్కసారి కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చిన ఏజెంట్లు బయటకు వెళ్తే తిరిగి లోపలకు రావడానికి వీలుండదు. ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకురావడానికి సిబ్బందిని కేటాయిస్తారు.

సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్

పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ నిర్ణయిస్తారు. ఆ డ్రెస్ కోడ్‌ని అనుసరించే ఆయా రూమ్‌లకు సిబ్బంది లోపలికి వెళ్లడానికి అనుమతి ఇస్తారు. ఒక రౌండు పూర్తయ్యాకే మరో రౌండుకు సంబంధించి కంట్రోల్ యూనిట్లు తీసుకు రావాల్సి ఉంటుంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లే వారికి ఐడీ కార్డులు తప్ప ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్‌లు ఉండకూడదు. సిబ్బంది లేదా కౌంటింగ్ ఏజెంట్స్ ఎవరైనా ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్‌లు తీసుకొస్తే.. వారిని లోపలికి పంపించరు. వాటిని వేరే చోట భద్రపరిచిన తర్వాతే లోపలికి పంపిస్తారు.

ఎన్‌కోర్ యాప్‌లో నమోదు తర్వాతే..

ఓట్ల లెక్కింపులో భాగంగా స్ట్రాంగ్ రూంలను కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలోనే తెరుస్తారు. ఈవీఎంలను నమోదు చేసుకునేందుకు స్ట్రాంగ్ రూమ్‌లో ఒక నోడల్ ఆఫీసర్ ఉంటారు. ఈవీఎంలను కౌంటింగ్ గదిలోకి తీసుకురాగానే వాటికి సీల్ సరిగా ఉందా లేదా అని పరిశీలిస్తారు. ఈవీఎంలలో బ్యాటరీలు పని చేయకపోతే మార్చి ఆన్ చేస్తారు. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే వివరాలను ఎన్‌కోర్ యాప్‌లో నమోదు చేసిన అనంతరం ఫలితాలను ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు వెల్లడిస్తారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్ల లెక్కింపుకు ఒక ఏఆర్‌వో, కంప్యూటర్ అసిస్టెంట్, కంప్యూటర్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. కేంద్ర పరిశీలకులు కౌంటింగ్ ప్రక్రియ, ఫలితాల వెల్లడి, డిక్లరేషన్ వరకు దగ్గరుండి పరిశీలిస్తారు. కౌంటింగ్ పూర్తి కాగానే ఫలితాలను ప్రకటించి గెలుపొందిన అభ్యర్థికి ఫారం–21 అందజేస్తారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

- వైభవంగా స్వర్ణ పుష్పార్చన
- శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.


వైభవంగా నిత్య కల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు అర్చకులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

నేడు ధూమపాన వ్యతిరేక దినం
స్మోకింగ్‌తో తోటివారి అనారోగ్యానికి కారణం కావొద్దు
సాధనతో దురలవాట్లకు దూరం కావొచ్చు

పొగ.. పగ







దాబాగార్డెన్స్(విశాఖ): పొగ.. పగ సాధిస్తోంది. సరదా.. సరదా సిగరెట్టు.. అనారోగ్యానికి తొలిమెట్టులా మారిపోయింది. ఎంత ఒత్తిడి నుంచైనా సిగరెట్, బీడీ, చుట్టలు ఉపశమనం కలిగిస్తాయని, అవి లేనిదే జీవితం లేదని గొప్పలు చెప్పే పొగరాయుళ్లు.. వైద్యులు చెప్పే విషయాలు చదివితే గుండె జారడం ఖాయం.

ధూమపానం వల్ల గుండెతో పాటు జేబుకూ చిల్లు తప్పదు. ఆ విషయం తెలుసుకునే లోపే సిగరెట్ పొగలాగే మన ప్రాణాలు కూడా గాల్లో కలిసిపోతాయనేది నిపుణుల మాట. సిగరెట్, గుట్కా, పాన్ మసాలా పేరు ఏదైనా.. పొగాకును ఏ రూపంలో సేవించినా ప్రమాదమే అంటున్నారు వైద్యులు. ఒక సిగరెట్‌లో నాలుగు వందలకు పైగా హానికర విష రసాయనాలుంటాయి. అందులో 48 కంటే ఎక్కువ క్యాన్సర్ కారకాలని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ కారకాలు ఊపిరితిత్తులు, గొంతు, నాలుక వంటి భాగాలకు క్యాన్సర్‌ను సులువుగా కలగజేస్తాయి. గర్భిణులు ధూమపానం చేస్తే గర్భస్థ శిశువు మృదు అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ధూమపానం చేసే వ్యక్తి తనకు మాత్రమే కాకుండా తన చుట్టూ ఉండేవారి ఊపిరితిత్తుల్లో 25 శాతం విషవాయువును ఉచితంగా పంపుతూ వారి అనారోగ్యానికి కారణమవుతున్నాడు. దేశంలో దీని కారణంగానే ప్రతి రోజూ 2000 మంది చొప్పున.. ఏటా 8 లక్షల మంది మృత్యువాత పడుతున్నట్టు అంచనా. నానాటికీ మహమ్మారిగా మారుతున్న ఈ విషవాయివు అలవాటును తక్షణం మానేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు సామాజిక కార్యకర్తలు. దృఢసంకల్పంతో ఈ అలవాటును దూరం చేసుకోవడం పెద్ద విషయమేమీ కాదంటున్నారు వైద్యులు.

అనర్థాలివే..

గుట్కా తిన్నా, సిగరెట్ తాగినా, మద్యం సేవించినా క్యాన్సర్, గుండె, కిడ్నీ జబ్బులు, అల్సర్, దగ్గు, ఆయాసం, ఓపిక లేకపోవడం వంటి రోగాలకు దగ్గరవుతారు. మంచానికి పరిమితమవడంతో జీవితం కష్టాల పాలవుతుంది.

ఇలా చేయండి..

- మీకు ధూమపానం అలవాటు ఉంటే మీ వద్ద సిగరెట్, బీడీ, చుట్ట, గుట్కా వంటి వాటిని ఉంచుకోకండి.
- వాటిని తీసుకునే అలవాటు ఉన్న వ్యక్తుల నుంచి కొంత కాలం దూరంగా ఉండండి.
- పొగాకు సేవించడం సంపూర్ణంగా వదిలిన నాడే సంపూర్ణ ఆరోగ్యం పొందగలమనే నిజాన్ని మరువకండి.
- ధూమపానం చేయాలనిపించినప్పుడల్లా లవంగాలు, యాలకులు వంటి వాటిని తీసుకున్నట్టయితే తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది.
- ఆరంభంలో నాలుగు వారాలు, ఆ తర్వాత 6 నెలల పాటు ఇటువంటి ప్రయత్నం చేసి నెమ్మదిగా ఈ దురలవాటు నుంచి శాశ్వత విముక్తి పొందవచ్చు.
- ఆధ్యాత్మిక జీవనాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా కూడా ధూమపానానికి దూరం కావచ్చు.
- మనశ్శాంతితో పాటు మనోబలం, సహనశక్తి, వృద్ధి అవుతాయని, తద్వారా వ్యసనాలపై అసహ్యం కలుగుతుందనేది మెడిటేషన్ కేంద్రాల వారి సూచన.
- పొగాకు సేవించడం వదిలేసిన 12 గంటల్లోనే మీకు చక్కని అనుభూతి కలుగుతుంది. లోతైన శ్వాస మీ సొంతమవుతుంది. రెండు రోజుల తర్వాత భోజనం ఎంతో రుచిగా అనిపిస్తుందని చెబుతున్నారు వైద్య నిపుణులు.
- ప్రతిరోజూ వ్యాయామం, ఆటలాడం వంటి వాటికి సమయం ఇవ్వాలి. ఫలితంగా మస్తిష్కం పనితీరు పెరుగుతుంది. దీని వల్ల సిగరెట్ తాగాలనే కోరిక కలగదని చెబుతున్నారు నిపుణులు.



దృఢ సంకల్పంతో..

పొగతాగడం వల్ల కొత్త జబ్బులు వస్తున్నాయి. శారీరక రోగాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యల వల్లనే చాలా మంది పొగాకుకు బానిసలవుతున్నారు. పొగాకు సేవించడం వల్ల భవిష్యత్‌లో మంచాన పడతారు. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా, ఎన్ని మందులు, ఎంత మంది డాక్టర్ల సలహాలు తీసుకున్నా మార్పు రాని ఈ వ్యసనాలను దృఢ సంకల్పం అనే మందుతోనే మానడం సాధ్యమవుతుంది.

– డాక్టర్ సత్యశ్రీ, చెస్ట్ ఫిజీషియన్

సహజ రాజయోగతో విముక్తి

సహజ రాజయోగ ద్వారా వ్యసనాలకు శాశ్వత విముక్తి కలుగుతుంది. 300 ఏళ్లుగా పరిచయమైన పొగాకు, మత్తుపానీయాలు నేటి మానవ సమాజ నైతిక పతనానికి మూల కారణాలు. ప్రపంచ వాతావరణ పరిస్థితులు, మానవ సమాజ స్థితిగతులు పరిశీలించినట్టయితే వ్యసనాలు, మత్తుపదార్థాలను తక్షణమే వదిలిస్తేనే మానవజాతిని పర్యావరణ కాలుష్యం నుంచి రక్షించుకోగలుగుతాం.

– బీకే రమా, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ప్రతినిధి

పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనర్థాలు

ఆరిలోవ : పొగాకు ఉత్పత్తుల వాడడడం వల్ల పలు అనర్థాలు ఏర్పడుతాయని, దీనిపై ప్రభుత్వాలు కఠినమైన చర్యలు చేపట్టాలని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ వూన్న మురళీకృష్ణ కోరారు. ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన పొగ తాగడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. పొగాకు వాడకం వల్ల దేశంలో ఏటా 1.3 మిలియన్ల మంది మరణిస్తున్నారన్నారు. ఇది శరీరంలో అన్ని అవయవాల జీవ ప్రక్రియను ప్రభావితం చేస్తుందన్నారు. క్యాన్సర్, ఉదర, హృదయం జీవ ప్రక్రియల రుగ్మతులు రావడంతో పాటు అంగవైకల్యానికి కారణమవుతుందన్నారు. పొగ తాగినవారితో పొగను పీల్చుతున్నవారు సైతం క్యాన్సర్‌కు గురవుతున్నారన్నారు. పొగాకును ఆకర్షించడానికి వాటి పరిశ్రమలు 15,000 కొత్త రుచులను సమాజంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. భారత ప్రభుత్వం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం ద్వారా సమాజంలో పొగాకు ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం చాలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

యూత్‌ను ఆకట్టుకున్న డర్టీఫెలో

మద్దిలపాలెం : మాఫియా మెడలు వంచే కథాంశంతో జి. భద్రకాళి సమర్పణలో రాజ్ ఇండియా ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దర్శకుడు ఆడారి మూర్తి తెరెక్కించిన డర్టీఫెలో చిత్రాన్ని యువత విశేషంగా ఆదరిస్తున్నారని చిత్ర హీరో శాంతిచంద్ర అన్నారు. మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో ఐనాక్స్ థియేటర్‌లో గురువారం చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా శాంతిచంద్ర మాట్లాడుతూ ఈనెల 24న చిత్రం విడుదలైందన్నారు. రోజురోజుకూ ప్రేక్షాదరణతో దూసుకుపోతోందన్నారు. విశాఖ అందాల నడుమ ఈచిత్రాన్ని తెరెక్కించామని చెప్పారు.



సీఎంఆర్ సెంట్రల్‌లో సందడి చేస్తున్న హీరో శాంతిచంద్ర, హీరోయిన్లు నక్రిత, దీపికాసింగ్

15 నుంచి మలేరియా నివారణ మందు స్ప్రేయింగ్

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో వచ్చే నెల 15 నుంచి రెండో విడత మలేరియా నివారణ మందు స్ప్రేయింగ్ ప్రారంభం కానుందని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలు నుంచి ఎంపీడీవోలు, మలేరియా అధికారులు, సచివాలయ కార్యదర్శులు, డీఎల్పీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో వర్షాకాలంలో మలేరియా ప్రబలకుండా పీహెచ్‌సీల పరిధిలోని ప్రతి గ్రామంలో ఫాగింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలో ఫాగింగ్ మిషన్లు ఎన్ని ఉన్నాయి, వాటి పనితీరుపై సమీక్షించారు. మరమ్మతులు ఉంటే చేయించాలని తెలిపారు. గ్రామాల్లో జర్వాలు ఉంటే రక్తపరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలందించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఫాగింగ్ చేస్తున్నారా? లేదా తెలియజేయాలన్నారు. దీని నిర్వహణపై డీఎల్పీవో, ఎంపీడీవోలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో శిరీష, ఎంపీహెచ్‌వో రాజు, డీఎల్‌పీవో రఘునందన్, ఎంపీడీవో హరికృష్ణ, వీరకిశోర్ పాల్గొన్నారు.

16 కిలోల గంజాయి స్వాధీనం



పెదబయలులో గంజాయి, నిందితులతో పోలీసులు

పెదబయలు: ఒడిశా నుంచి జి.మాడుగుల తరలిస్తున్న 16 కిలోల గంజాయిని మండలంలోని కొత్తరూడకోట జంక్షన్ వద్ద స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు రూడకోట పంచాయతీ కొత్తరూడకోట జంక్షన్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేసినట్టు చెప్పారు. జి.మాడుగుల మండలం ఉవ్వాసింగి పంచాయతీ సోపలు గ్రామానికి చెందిన పాంగి శివాజీ,పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ జమదంగి గ్రామానికి చెందిన కిల్లో బంగురులు. ఒడిశా నుంచి జి.మాడుగులకు బైక్‌పై గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. నిందితులిద్దర్నీ రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. ఈ కేసులో మరో నిందితుడైన ఒడిశా రాష్ట్రం చీకుపనస గ్రామానికి చెందిన రామారావు పరారీలో ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు.

ఫిట్స్‌కు గురై ఉపాధి కూలీ మృతి



ఉపాధి కూలీ లోవకుమారి మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు

గంగవరం: మండలంలోని నెల్లిపూడికి చెందిన తాతపూడి లోవకుమారి(28) గురువారం ఉపాధి పనికి వెళ్లి వస్తుండగా ఫిట్స్‌కు గురై మృతి చెందినట్లు తహసీల్దార్ సత్యసులోచన తెలిపారు. పని ముగించుకుని తన తండ్రి నాగరాజుతో కలసి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఫిట్స్ వచ్చి కిందపడి మరణించిందన్నారు. ఆమెకు ఫిట్స్‌తో బాధపడుతూ ఇదివరకే మందులు వాడుతున్నట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వైద్యాధికారి సమక్షంలో తెలియజేశారన్నారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రరావు, వైద్యాధికారి సాయి రతన్, వీఆర్వో అప్పలకొండ, మృతురాలు ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేశారన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఆయా అధికారులతోపాటు ఉపాధి ఏపీవో ప్రకాష్ పరామర్శించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్(విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తులు రూ.1,000 రుసుం చెల్లించి ఈ పూజలో పాల్గొనవచ్చు.

ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతి కేసును ఛేదించిన పోలీసులు

- వన్యప్రాణులకు అమర్చిన విద్యుత్ ఉచ్చులో పడి మృతి చెందిన ధనరాజు
- మృతదేహాన్ని రిజర్వుఫారెస్టులోని తుప్పల్లో పడేసిన వ్యక్తుల అరెస్టు



ధనరాజు (ఫైల్)

గంగవరం: అదృశ్యమైన వ్యక్తి రిజర్వు ఫారెస్టులో శవమై కనిపించిన కేసును గంగవరం పోలీసులు ఛేదించారు. గంగవరం మండలం మొల్లేరు గ్రామానికి చెందిన పెనుమత్స ధనరాజు (61) అనే వృద్ధుడు మొల్లేరు సమీపంలో మామిడితోటలో నివాసం ఉంటున్నాడు. తన భర్త ధనరాజు ఈనెల 27 (సోమవారం) నుంచి కనిపించడం లేదని, తమకు ఆందోళనగా ఉందని ధనరాజు భార్య పెనుమత్స నాగమణి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు గంగవరం ఎస్‌ఐ బి.రామకృష్ణ కేసు నమోదు చేసి, అడ్డతీగల సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. ఆచూకీ కోసం పోలీసులు, బంధువులు గాలిస్తుండగా మొల్లేరు రిజర్వుఫారెస్టులో ధనరాజు మృతదేహం బుధవారం లభించింది. రిజర్వు అటవీ ప్రాంతంలో తుప్పల్లో బాగా పాడైపోయి ఉన్న ధనరాజు మృతదేహాన్ని గుర్తించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించిన సంగతి పాఠకులకు తెలిసిందే. అయితే ధనరాజు మృతిపై అడ్డతీగల సీఐ, గంగవరం ఎస్‌ఐ బి.రామకృష్ణ సమగ్ర విచారణ నిర్వహించగా ఇందుకు గల కారణాలు బయటపడ్డాయి. ఈ కేసు సంబంధించి ఇద్దరిని గంగవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ బి.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొల్లేరు గ్రామానికి చెందిన మలగల గోపాలకృష్ణ, ఆదిశేషులు అనే ఇద్దరు వ్యక్తులు వన్యప్రాణుల వేట కోసం మామిడి తోటలో విద్యుత్ ఉచ్చును ఏర్పాటు చేశారు.

మామిడి తోట సంరక్షణలో ఉన్న ధనరాజు ఆదివారం రాత్రి తోటలో సంచరిస్తూ ఆ విద్యుత్ ఉచ్చులో పడి ప్రాణాలు కోల్పోయాడు. ఉచ్చులో వన్యప్రాణి ఏదో పడిందని భావించిన ఆ ఇద్దరు విద్యుత్ ఉచ్చులో పడి ఉన్న ధనరాజును చూసి భయపడిపోయారు. మృతదేహాన్ని మామిడి తోటకు చాలా దూరంలో ఉన్న రిజర్వు ఫారెస్టులోకి తీసుకువెళ్లి తుప్పల్లో పడేశారు.. అడ్డతీగల సీఐ రవి కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి ఆ ఇద్దర్ని అరెస్టు చేశామని ఎస్‌ఐ తెలిపారు.నిందితులను రంపచోడవరం కోర్టులో హాజరుపరుస్తామని ఆయన చెప్పారు.

భర్తను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న మాజీ మిస్ వైజాగ్

- విడాకాలు ఇవ్వకుండా వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని ఆరోపణ
- మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు



నక్షత్ర, తేజల వివాహం

బీచ్‌రోడ్డు(విశాఖ) : వేరే అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకున్న తన భర్తను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది మాజీ మిస్ వైజాగ్ నక్షత్ర. తనకు విడాకులు ఇవ్వకుండా వేరే అమ్మాయిని పెళ్లి చేసుకొని కాపురం చేస్తున్నాడని ఆరోపిస్తూ గురువారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. 2011 మిస్ వైజాగ్ విజేత అయిన నక్షత్ర 2013లో ఓ సినిమా షూటింగ్ సమయంలో తేజతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారి మధ్య స్నేహం పెరిగింది. 2017లో ఇద్దరు ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఒక పాప కూడా పుట్టింది. అయితే కొన్ని నెలల తరువాత తేజ ఇతర అమ్మాయిలతో వివాహేతర సంబంధాలు కలిగి ఉన్నట్లు గుర్తించిన నక్షత్ర అతడిని నిలదీసింది. దీంతో ఆమెను వేధింపులకు గురిచేశాడు. ఆమె 2020లో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అతనిపై కేసు నమోదైంది. ఈక్రమంలో తేజ తనుచేస్తున్న నేవీ ఉద్యోగాన్ని కూడా కోల్పోయాడు. దీంతో ఫుల్ టైం సినిమా అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో మరింత మంది అమ్మాయిలతో వివాహేతర సంబంధాలను పెట్టుకున్నాడు. గురువారం ఒక అమ్మాయితో దసపల్లా హిల్స్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఉండగా నక్షత్ర వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే నక్షత్రనే తనపై తన కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు బనాయించిందని తేజ చెబుతున్నాడు. ఆఫీసులో ఓ సినిమా విషయమై ఒక అమ్మాయితో చర్చలు జరుపుతున్న సమయంలో నక్షత్ర వచ్చి దాడి చేసిందని ఆరోపించాడు. అది ఇల్లు కాదని, ఆఫీసు అని చెప్పుకొచ్చాడు.

అంతా చనిపోయాడనుకున్నారు.. కానీ..

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన వ్యక్తి



గోపాల్ మైతీని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ రామిరెడ్డి

అల్లిపురం: మూడేళ్ల కిందట ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. వెతికినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా జాడ లేకపోవడంతో చనిపోయాడని అంతా భావించారు. అయితే ఇక్కడే ట్విస్ట్ నెలకొంది. చనిపోయాడనుకున్న వ్యక్తి కొన్నేళ్ల తర్వాత సజీవంగా కళ్ల ముందు కనిపించడంతో ఆ కుటుంబం ఆనంద డోలికల్లో మునిగిపోయింది. బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత తెలిపిన వివరాలివీ.. ఈ నెల 2న సింధియాలో మతిస్థిమితం లేని వ్యక్తి తిరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ సిబ్బంది అక్కడకు వెళ్లారు. ఆయన్ని చినవాల్తేరు మానసిక చికిత్సాలయంలో చేర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి సహకారంతో మెరుగైన చికిత్స అందజేయడంతో అతని ఆరోగ్యం మెరుగుపడింది. దీంతో తన వివరాలు తెలపగలిగాడు. తన పేరు గోపాల్ చంద్ర మైతీ అని, తనది పశ్చిమ బెంగాల్‌లోని ముక్సద్‌పూర్ అని చెప్పడంతో అక్కడి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేశారు. ఆ పోలీస్ స్టేషన్‌లో మూడేళ్ల కిందటే అతను తప్పిపోయినట్లు కేసు నమోదు కావడంతో.. పోలీసులు గోపాల్ కుటుంబ సభ్యులకు ఈ సమాచారం తెలిపారు. దీంతో అతని అన్నయ్య సుబ్రత మైతీ, చిన్నాన్న దేబ్ దులాల్ మైతీ గురువారం నగరానికి చేరుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి, హెచ్‌వోడీ విజయలక్ష్మి, జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమతలు గోపాల్ మైతీని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా మైతీ కుటుంబ సభ్యులు మమతతో పాటు ఆస్పత్రి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

కేజీహెచ్ ఆర్‌ఎంవోగా శంకరరావు బాధ్యతల స్వీకరణ



అల్లిపురం: కేజీహెచ్ డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్‌ఎంవోగా డాక్టర్ శంకరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన జీవీఎంసీ, డీఎంహెచ్‌ఓ కార్యాలయాల్లో పనిచేశారు. కాగా జూన్ నెలాఖరుకు ఆయన రిటైర్ కానున్నారు.

విజయలక్ష్మికి వైద్య పరీక్షలు

కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌పై లైంగిక వేధింపులు ఆరోపణలు చేసిన గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మికి గురువారం కేజీహెచ్ గైనిక్ వార్డులో వైద్య పరీక్షలు నిర్వహించారు.